రెవెన్యూ జెఏసి చైర్మన్‌కు ఘన సన్మానం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

ఎపి రెవిన్యూ జెఏసి రాష్ట్ర చైర్మన్ విఎస్.దివాకర్‌ను ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా విఆర్‌ఎల సంఘం ఆధ్వర్యంలో సోమవారం అంబేద్కర్ భవనంలో ఘనంగా సత్కరించారు. విఆర్‌ఎల డిఎ రూ.500 మంజూరు చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినందుకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం జిల్లా అధ్యక్షుడు డి.వీరభద్రరావు, మోకా శ్రీను, అంజలి రావు పాల్గొన్నారు.

దివాకర్ ను సన్మానిస్తున్న సంఘ సభ్యులు

అన్నదాతకు అందని పరిహారం

- ఎన్నికల కోడ్ వస్తే మంజూరు కష్టం
- రబీకి అప్పులు చేయాల్సిన స్థితి
- పరిహారం కోసం రైతుల నిరీక్షణ

మాది రైతు కుటుంబం అన్నదాతలకు ఏ కష్టం వచ్చినా ముందుంటాం.. అంటూ ప్రతి సమావేశంలో మంత్రుల నుంచి ముఖ్యమంత్రి వరకు చెబుతుంటారు. అయితే క్షేత్ర స్థాయి పరిస్థితులు ఇందుకు భిన్నం. డిసెంబరులో వచ్చిన మిగ్‌జాం తుపాను ప్రభావంతో వరి సహా ఇతర పంటలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. నెల రోజులు దాటినా రైతులకు నష్టపరిహారం అందలేదు. సంక్రాంతి ముందే పరిహారం ఇస్తామని చెప్పినా ఆ మేరకు ప్రభుత్వం చర్యలు చేపట్టలేదు.

ప్రజాశక్తి- రాజోలు

2023-24 ఖరీఫ్ సీజన్‌లో ఆది నుంచి రైతన్నలకు కష్టాలు తప్పలేదు. గత ఏడాది డిసెంబరు మొదటి వారంలో ముమ్మరంగా ఖరీఫ్ కోతలు జరుగుతున్న తరుణంలో మిగ్‌జాం తుపాను నట్టేట ముంచింది. గాలులు, భారీ వర్షం కారణంగా పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది. జిల్లాలో 1.75 లక్షల ఎకరాల్లో ఖరీఫ్ సాగు చేపట్టగా.. తుపాను దెబ్బకు వరి రాశులు తడిచిపోగా.. కోత దశలో ఉన్న వరిచేలు.. నేలకొరిగి.. కుళ్లిపోయాయి. బెండ, వంగ, ఆనబ, బొప్పాయి, అరటి, మిర్చి వంటి ఉద్యాన పంటలకు తీవ్ర నష్టం వాటిల్లింది.

ప్రతిపాదనలు పంపినా..

పంటలను నష్టపోయిన రైతులను గుర్తించి వారికి పరిహారం కోసం ప్రభుత్వానికి నివేదించే క్రమంలో ఆర్‌బికె సిబ్బంది, రెవెన్యూ, పంచాయతీ అధికారుల బృందం గ్రామాల్లో పర్యటించి అంచనాలు రూపొందించారు. అంబేద్కర్ కోనసీమ జిల్లాలో 21,008 ఎకరాల్లో వరి పంటకు నష్టం వాటిల్లినట్లు గుర్తించారు. సామాజిక తనిఖీల అనంతరం 19,849 మంది రైతులకు రూ.17.85 కోట్లు నష్టం వాటిల్లినట్లు అంచనా వేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించారు. ఉద్యాన శాఖ ఆధ్వర్యంలో ముమ్మిడివరం, పి.గన్నవరం, రాజోలు, మామిడికుదురు, అమలాపురం, ఐ.పోలవరం, అంబాజీపేట, కొత్తపేట, అయినవిల్లి, ఆత్రేయపురం, ఆలమూరు, కె.గంగవరం, కపిలేశ్వరపురం, రావులపాలెం, ఆలమూరు, మలికిపురం, రామచంద్రపురం, మండపేట, అల్లవరం మండలాల్లోని 97 గ్రామాల్లో అరటి 459.540, కూరగాయలు 633.779, బొప్పాయి 29.824, పసుపు 0.660, పూలతోటలు 35.320, తమలపాకులు 3.720 వెరసి 1162.843 హెక్టార్లలో పంటలకు నష్టం వాటిల్లినట్లు లెక్క తేల్చారు. కాట్రేనికోన, రాజోలు, మలికిపురం, సఖినేటిపల్లి, కొత్తపేట మండలాల్లోని 22 గ్రామాల్లో 309 కొబ్బరిచెట్లుకు నష్టం వాటిల్లినట్లు లెక్క తేల్చి.. మొత్తంగా 3530 మంది రైతులకు రూ.2,39,69,411 పెట్టుబడి రాయితీ అందించాలని ప్రభుత్వానికి నివేదించారు. సంక్రాంతి నాటికి రైతులకు నష్ట పరిహారం అందిస్తామని ప్రకటించినా.. నేటికీ అతీగతీ లేదు.

పరిహారం కోసం ఎదురు చుపులు

ఖరీఫ్ తుది దశలో వచ్చిన తుపాను అన్నదాతలకు అపార నష్టాన్ని మిగిల్చింది. కోతకు సిద్ధంగా ఉన్న వరి పంట నేల వాలగా, చేలల్లోని పనలు, కుప్పలు నీటిలో నాని కొన్నిచోట్ల ధాన్యం మొలకలొచ్చాయి. తుపాను వచ్చిన పదిహేను రోజుల తర్వాత పంట నష్టం అంచనాలకు వ్యవసాయ, రెవెన్యూ, పరిపాలన శాఖల నుంచి గ్రామ, మండల, డివిజన్ స్థాయి అధికారులతో ప్రభుత్వం ప్రత్యేక కమిటీలు ఏర్పాటు చేసింది. అప్పటికే వర్షాలకు తడిసిన ధాన్యం రాశులు, దెబ్బతిన్న వరి పంటను రైతులు ఒబ్బిడి చేసుకున్నారు. నేలనంటిన పంటను కోసి కొన్నిచోట్ల మాసూళ్లు పూర్తి చేశారు. కాగా, నిబంధనల పేరిట పూర్తిస్థాయిలో అంచనాలు నమోదు చేయలేదనే ఆరోపణలొచ్చాయి. పరిహారమైనా సకాలంలో అందితే రబీ పెట్టుబడికి పనికొస్తుందని రైతులు భావించారు. రాకపోవడంతో రబీకి అప్పులు చేసి పెట్టుబడి పెట్టాల్సి వస్తోందని రైతులు చెబుతున్నారు. ఎన్నికల కోడ్ వచ్చే అవకాశం ఉండటం, రబీ ప్రారంభమై రోజులు దాటినా పరిహారం అందకపోవడంతో వస్తుందా రాదా అన్న ఆందోళన రైతుల్లో నెలకొంది.

మిగ్‌జాం తుపానుకు రాజోలులో నేలకొరిగిన వరి చేను (ఫైల్ ఫొటో)

త్వరలో పరిహారం విడుదల

తుపాను కారణంగా పంటలు నష్టపోయిన రైతులను గుర్తించి.. నష్టం అంచనాలు తయారు చేసి ప్రభుత్వానికి పంపాం. జిల్లాలో 21 వేల ఎకరాల్లో పంటలకు నష్టం వాటిల్లి రూ.17.85 కోట్లు నష్టం వాటిల్లినట్లు గుర్తించి ప్రభుత్వానికి నివేదిక పంపాం. రైతులకు పంట నష్ట పరిహారం త్వరలో విడుదలయ్యే అవకాశం ఉంది.

- వి.బోసుబాబు, జిల్లా వ్యవసాయాధికారి.

స్పందనలో ప్రజా సమస్యల పరిష్కారం

ప్రజాశక్తి-అమలాపురం

జగనన్నకు చెబుదాం-ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమంలో అందిన అర్జీలను నాణ్యతతో అర్జీదారుల సంతప్తే ధ్యేయంగా పరిష్కారించాలని జిల్లా కలెక్టర్ హిమాన్సు శుక్లా అధికారులను ఆదేశించారు. సోమవారం స్థానిక కలెక్టర్ కార్యాలయ ప్రాంగణంలోని గోదావరి భవన్‌లో జిల్లా కలెక్టర్ అధ్యక్షతన జగనన్నకు చెబుదాం-స్పందన కార్యక్రమాలను జిల్లా స్థాయి అధికారులతో నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ హిమాన్సు శుక్లా, జాయింట్ కలెక్టర్ ఎస్.నుపూర్ అజయ్, డిఆర్‌ఒ సిహెచ్.సత్తిబాబులతో కలిసి జిల్లా స్థాయి నుంచి వచ్చిన ప్రజల వినతులను స్వీకరించారు. ఈ అర్జీలను సత్వరం పరిష్కారించవలసిందిగా స్థానికంగా ఉన్న ఆయా శాఖల అధికారులకు జిల్లా కలెక్టర్ ఆదేశాలు జారీ చేసారు. మండల స్థాయి నుంచి వచ్చిన సమస్యలను సంబంధిత తహశీల్దార్లు, ఎంపిడిఒలు వర్చువల్ విధానంలో సంప్రదించి అర్జీదారులకు తగు పరిష్కార మార్గాలు చూపారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రజల సంక్షేమం కోసం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలు, రెవెన్యూ, పౌర సరఫరాల సేవలు, నవరత్నాలు-పేదలందరికీ ఇళ్ల పథకం కింద పట్టాల పంపిణీ, ఇళ్ల మంజూరు, పెన్షన్లు, సర్వే, ఉద్యోగ ఉపాధి అవకాశాలు, భూ వివాదాలు తదితరాలకు సంబంధించి మొత్తం 260 అర్జీలు వచ్చాయి. ఈ సందర్భంగా కలెక్టర్ హిమాన్సు శుక్లా మాట్లాడుతూ జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో అందిన ప్రతి వినతినీ క్షుణ్ణంగా పరిశీలించి క్షేత్రస్థాయిలో విచారిస్తూ నాణ్యమైన మార్గాలు అర్జీదారుడు సంతృప్తి చెందే స్థాయిలో చూపుతూ స్పందన జగనన్నకు చెబుదాం కార్యక్రమాల అమలు తీరు పట్ల అర్జీదారుల్ల నమ్మకాన్ని పెంపొందించాలన్నారు. గడువు దాటిన అర్జీలు లేకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని ఆయన స్పష్టం చేశారు. ఒకే అంశంపై పదే పదే అర్జీలు నమోదు కాకుండా అర్జీల పరిష్కార సరళిపై అధికారులు ప్రత్యేక దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ అధికారు లను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో సిపిఒ వెంకటేశ్వర్లు, డిఆర్‌డిఎ పీడీ వి.శివశంకర్ ప్రసాద్, డిపిఒ వి.కృష్ణకుమారి, డిఎస్‌ఒ ఎ.పాపారావు, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ మదన్‌మోహన్ రావు, జిల్లా వ్యవసాయ అధికారి వి.బోసు బాబు పాల్గొన్నారు.

ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ హిమాన్సు శుక్లా

భూ హక్కు చట్టం రద్దు కోసం నిరసన

ప్రజాశక్తి-రామచంద్రపురం

భూ హక్కు చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని కోరుతూ రామచంద్రపురం బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో సోమవారం న్యాయవాదులు నిరసన కార్యక్రమం నిర్వహించారు. ప్రజల ఆస్తి హక్కులను హరించే భూహక్కు చట్టాన్ని నిలిపివేయాలని నినాదాలు చేశారు. దీనికి సంబంధించిన జిఒ 512ను రద్దు చేయాలని, ప్రజల ఆస్తులకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా వారు ఆర్‌ఒఆర్ చట్టాన్ని సవరణ చేస్తే సరిపోతుందని, కొత్త చట్టం అవసరం లేదన్నారు. చట్టాన్ని రద్దు చేయకపోతే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష కార్యదర్శులు పిల్లి మురళీమోహన్ వెంకటరమణ, వాడ్రేవు సాయి ప్రసాద్, ఉపాధ్యక్షులు పలివెల సత్యనారాయణ, జూనియర్ న్యాయవాదులు పిల్లా పృథ్వి, సీనియర్ న్యాయవాదులు డిపి.శాస్త్రి, బి.సూర్యనారాయణ, ఆర్‌విజి.సుబ్బారావు, బినయ్ బాబు, ఐ.గంగాధర్, కెవివి.సత్యనారాయణ పాల్గొన్నారు.

రామచంద్రపురంలో న్యాయవాదుల నిరసన

నగర పంచాయతీ కమిషనర్‌గా వెంకటరామి రెడ్డి

ప్రజాశక్తి-ముమ్మిడివరం

ముమ్మిడివరం నగర పంచాయతీ కమిషనర్‌గా జి.వెంకట రామిరెడ్డి సోమవారం నగర పంచాయతీ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. సాధారణ ఎన్నికల బదిలీల్లో భాగంగా జమ్మలమడుగు మున్సిపల్ కమిషనర్‌గా పని చేస్తూ బదిలీపై ముమ్మిడివరం వచ్చారు. నగర పంచాయతీ చైర్మన్ కమిడి ప్రవీణ్ కుమార్, ఎంఎల్‌ఎ పొన్నాడ వెంకట సతీష్ కుమార్‌ను ఆయన మర్యాద పూర్వకంగా కలిశారు. ఇప్పటి వరకు పని చేసిన లోవరాజు కృష్ణా జిల్లా తిరువూరు నగర పంచాయతీ కమిషనర్‌గా బదిలీపై వెళ్ళారు. కమిషనర్ వెంకట రామి రెడ్డిని మేనేజర్ నూకరాజు, టిపిఒ కె.మంజుల అభినందనలు తెలిపారు.

మండపేటలో పారిశుధ్య పనుల పరిశీలన

ప్రజాశక్తి-మండపేట

మండపేట పట్టణ పరిధిలోని పారిశుధ్య పనులను మున్సిపల్ కమిషనర్ బి.రాము సోమవారం తెల్లవారుజామున పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పట్టణ ప్రజల సహాయ సహకారాలతో పారిశుధ్య నిర్వహణ సక్రమంగా నిర్వహించాలని కార్మికులకు సూచించారు. ఉద్యోగస్తులంతా కచ్చితంగా డ్రెస్ కోడ్, సమయపాలన తప్పనిసరిగా పాటించాలన్నారు. స్థానికుల నుంచి వచ్చిన ఫిర్యాదుల నేపథ్యంలో చర్యలు చేపడతామన్నారు. ఈయన వెంట శానిటరీ ఇన్స్ పెక్టర్ లావణ్య తదితరులు ఉన్నారు.

పారిశుధ్య కార్మికులతో మాట్లాడుతున్న రాము

వెంకన్నను దర్శించుకున్న ట్రిబ్యునల్ చైర్మన్

వెంకన్న ఆలయంలో ట్రిబ్యునల్ చైర్మన్ దంపతులు

ప్రజాశక్తి-ఆత్రేయపురం

వాడపల్లి వెంకటేశ్వర స్వామిని సోమవారం ఆంధ్రప్రదేశ్ ఎండోమెంట్ ట్రిబ్యునల్ చైర్మన్ కెవిఎల్.హరినాథ్ దంపతులు దర్శించుకున్నారు. వారికి ఆలయ చైర్మన్ రుద్రరాజు రమేష్ రాజు, ఇఒ ఎం.సత్యనారాయణ రాజు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. మండలంలోని లొల్ల గ్రామానికి చెందిన ముక్కవిల్లి శ్రీరామ చంద్రమూర్తి, లక్ష్మీనర్సమాంబ దంపతులు స్వామి వారికి 9.6 గ్రాముల బంగారు తిరునామం సమర్పించారు.

ఎటిపి 02 వెంకన్న ఆలయంలో చైర్మన్ దంపతులు

విద్యానిధికి రూ.15,116 విరాళం

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

కోనసీమ దేవాంగ సంక్షేమ సంఘం శాశ్వత విద్యానిధికి కొత్తపేట గ్రామానికి చెందిన, బండారులంక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంపిహెచ్ఒ కాశిన శేషుబాబు రూ.15,116 విరాళం అందజేశారు. సంఘం అధ్యక్షుడు వూటుకూరి సుబ్రహ్మణ్య స్వామికి ఈ మొత్తాన్ని అందించారు. ఈ సందర్భంగా శేషుబాబును దేవాంగ సంఘం అధ్యక్ష కార్యదర్శులు, కార్యవర్గ సభ్యులు అభినందించారు.

ఐసిటి సిములేషన్‌పై శిక్షణ

ప్రజాశక్తి-కొత్తపేట

రాష్ట్ర ప్రభుత్వం జీవశాస్త్ర ఉపాధ్యాయులకు సర్వ శిక్ష అభియాన్ ద్వారా ఐసిటి సిములేషన్‌పై సోమవారం ఒకరోజు శిక్షణ కార్యక్రమాన్ని స్థానిక బాలికోన్నత పాఠశాలలో సర్వ శిక్ష అభియాన్ ఆధ్వర్యాన నిర్వహించారు. ఐదు మండలాలకు చెందిన 83 మంది ఉపాధ్యాయులకు శిక్షణ ఇచ్చారు. ఎంఇఒలు ఎం.హరిప్రసాద్, కె.లీలావతి, బి.శ్రీనివాసరాజు, పాఠశాల హెచ్‌ఎం ఎన్.సత్యనారాయణ, జిల్లా అబ్జర్వర్ డి.రమేష్ బాబు మాట్లాడారు. జిల్లా రిసోర్స్ పర్సన్స్‌గా వేమవరపు మురళీకృష్ణ, పట్టాభి రామారావు, గనిరాజు, వాసంతి, లత, బండారు సీతారామం సిములేషన్‌పై శిక్షణ ఇచ్చారు.

మధ్యాహ్న భోజన కార్మికుల ధర్నా

ప్రజాశక్తి-ముమ్మిడివరం

తమ డిమాండ్లు నెరవేర్చాలని కోరుతూ మధ్యాహ్న భోజన కార్మికులు నగర పంచాయతీ పరిధిలోని జిల్లా కార్యాలయాల ప్రాంగణంలో సోమవారం ధర్నా చేశారు. ఈ ధర్నాలో సిఐటియు జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్, నూకల బలరామ్ మాట్లాడారు. కార్మికులకు రూ.10 వేల వేతనంతో పాటు, మెనూ ఛార్జీలు పెంచాలని డిమాండ్ చేశారు. గత 20 ఏళ్లుగా పథకంలో పని చేస్తున్న కార్మికులతో ప్రభుత్వాలు వెట్టిచాకిరీ చేయిస్తున్నాయన్నారు. సిఎం వైఎస్.జగన్ పాదయాత్ర సందర్భంగా అధికారంలోకి వస్తే రూ.20 వేల వేతనంతో పాటు మెనూ ఛార్జీలు పెంచుతామని హామీ ఇచ్చి ఐదేళ్లు గడుస్తున్నా నేటికీ నెరవేర్చ లేదని ఆవేదన వ్యక్తం చేశారు. పెరిగిన నిత్యావసర సరుకుల ధరలను దృష్టిలో ఉంచుకుని తక్షణమే సమాన పనికి సమాన వేతనం, మెనూ ఛార్జీలను పెంచాలని, ప్రమాద బీమా కల్పించాలని డిమాడ్ చేశారు. అనంతరం డిఇఒకు వినతిపత్రం అందజేశారు. ప్రతి నెలా 5వ తేదీ లోపు కార్మికులకు రావాల్సిన వేతనాలు, బిల్లులు ఇవ్వాలని, గ్యాస్‌ను ఉచితంగా ప్రభుత్వమే సరఫరా చేయాలని, పెరుగుతున్న ధరలకు అనుగుణంగా మెనూ ఛార్జీలు రూ.20 పెంచాలని, ప్రమాద బీమా కల్పించాలని, అగ్ని ప్రమాదానికి గురైన కార్మికులకు రూ.10 లక్షల నష్టపరిహారం, పిఎఫ్, ఇఎస్‌ఐ సౌకర్యం కల్పించాలని, పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, రెండు నెలలకు ఒకసారి ఎంఇఒలతో సమావేశాలు ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన ధర్నాలో మధ్యాహ్న భోజన పథకం కార్మిక యూనియన్ జిల్లా కన్వీనర్ సత్యవేణి, భవన నిర్మాణ కార్మిక సంఘం జిల్లా నాయకుడు విప్పర్తి మోహన్‌రావు, యుటిఎఫ్ సీనియర్ నాయకుడు జనిపల్లి సత్యనారాయణ, సిఐటియు నాయకుడు నిమ్మకాయల వెంకటేష్, నాయకులు లక్ష్మీదేవి, కృష్ణకుమారి, బొంతు పార్వతి, గంగారత్నం, గుత్తుల కనకదుర్గ, సత్యవతి, సుభద్ర, సుశీల, రమావతి, నాగలక్ష్మి, సరస్వతితో పాటు జిల్లా నలుమూలల నుంచీ కార్మికులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

ధర్నా చేస్తున్న మిడ్డే మీల్స్ కార్మికులు

'గడప గడపకూ'లో సూర్యప్రకాశ్

ప్రజాశక్తి రామచంద్రపురం

పట్టణంలోని ఐదో వార్డులో సోమవారం ఉదయం గడపగడపకూ మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. వైసిపి నియోజకవర్గఇన్‌ఛార్జి పిల్లి సూర్యప్రకాష్ వార్డులో ఇంటింటికీ పర్యటించారు. ఆయనకు వైయస్సార్ నగర్ నాయకులు ఘనంగా స్వాగతం పలికారు. ప్రతి కుటుంబాన్నీ పలకరించి వారి సమస్యలు తెలుసుకొని తక్షణమే పరిష్కరించే విధంగా చర్యలు చేపట్టారు. ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి చేస్తున్న అభివృద్ధి పథకాల గురించి ప్రజలకు వివరించారు. 2024లో మళ్లీ వైఎస్‌ఆర్ కాంగ్రెస్ పార్టీని అత్యధిక మెజార్టీతో గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గాదంశెట్టి శ్రీదేవి, పట్టణ కన్వీనర్ గాదంశెట్టి శ్రీధర్ పాల్గొన్నారు.

పట్టణంలో గడపగడపకూ కార్యక్రమంలో పాల్గొన్న సూర్యప్రకాష్

టిడిపిలో పలువురు నాయకుల చేరిక

ప్రజాశక్తి-కొత్తపేట

వానపల్లిలో టిడిపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి బండారు సత్యానందరావు సమక్షంలో పలువురు సోమవారం పార్టీలో చేరారు. బాబు ష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారంటీ కార్యక్రమంలో భాగంగా తెలుగుదేశం పార్టీ నాయకులతో కలసి సత్యానందరావు పాల్గొన్నారు. వానపల్లిలో జనసేన నాయకులు సిద్ధబత్తుల సత్యనారాయణ, ఇళ్ల కష్టార్జునరావు, వైసిపికి చెందిన వాసంశెట్టి ధనరాజు, అప్పారి పల్లంరాజు, రాయుడు రత్నం రాజు, పట్టా ధర్మరాజు, ముళ్ల రాంబాబు, మట్టపర్తి సుబ్రహ్మణ్యం, సిద్దుల పళ్ళంశెట్టి, నేదునూరి దొరబాబు, గనిశెట్టి సత్తిపండు, చవ్వాకుల వెర్రియ్య, అప్పారి రాజు, చీకరమిల్లి వెంకట్రావు టిడిపిలో చేరారు. వీరికి సత్యానందరావు కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా సత్యానందరావు మాట్లాడుతూ వైసిపిని ఇంటికి సాగనంపడమే కార్యకర్తల లక్ష్యంగా తీసుకోవాలని సూచించారు. తద్వారా రాష్ట్రానికి, రాష్ట్ర ప్రజలకు సుపరిపాలన అందించవచ్చని తెలిపారు. పార్టీలో చేరిన అందరికీ ప్రాముఖ్యత కల్పిస్తామని అన్నారు. గెలిచిన తరువాత వానపల్లి గ్రామాన్ని అభివృద్ధి వైపు పరుగు పెట్టిస్తానని హామీ ఇచ్చారు.

టిడిపిలో చేరిన నేతలతో బండారు

సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నేతలు

7 నుంచి ఇంటింటా కాంగ్రెస్

ప్రజాశక్తి-ఉప్పలగుప్తం

ఈ నెల 7 నుంచి మండలంలో ఇంటింటా కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం ప్రారంభిస్తున్నట్లు కాంగ్రెస్ పార్టీ మండల సమావేశం పేర్కొంది. ఉప్పలగుప్తం పంచాయతీ చీకట్లపాలెంలోని సీనియర్ కాంగ్రెస్ పార్టీ నాయకుడు, ఏఐసిసి కో ఆప్షన్ సభ్యులు చీకట్ల అబ్బాయి ఇంటి వద్ద సోమవారం మండల కాంగ్రెస్ పార్టీ సమావేశం నిర్వహించారు. కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు పోలిశెట్టి హరిబాబు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఇంటింటా కాంగ్రెస్ పార్టీ కార్యక్రమంపై సమీక్షించారు. ఉదయం ఎన్.కొత్తపల్లి పంచాయతీ నల్లావారి పేట నుంచి ఇంటింటా కాంగ్రెస్ పార్టీ కార్యక్రమం ప్రారంభిస్తామని, పార్టీ శ్రేణులంతా విజయవంతం చేయాలని కోరారు. ఎపిసిసి అధ్యక్షురాలుగా బాధ్యతలు స్వీకరించిన వైఎస్ షర్మిల నేతత్వంలో కాంగ్రెస్ పార్టీకి పూర్వ వైభవాన్ని తీసుకువచ్చేందుకు కృషి చేయాలన్నారు. ఈ సమావేశంలో ఎపిసిసి ప్రధాన కార్యదర్శి అయితాబత్తుల సుభాషిణి, ఎపిసిసి సభ్యురాలు దోనిపాటి విజయలక్ష్మి, జిల్లా ప్రధాన కార్యదర్శి నిమ్మకాయల ప్రసాద్, త్రిమూర్తులు, గెడ్డం సురేష్ బాబు, దామిశెట్టి జయశంకర్, ఆకుల వెంకటరెడ్డి నాయుడు, జోగి అర్జునరావు, బిఎజెడబ్ల్యు రెడ్డి బాబు, అయితాబత్తుల కుమార్ సింగ్ పాల్గొన్నారు.

కార్టూ'నిజం'



వైద్య బందంతో సర్పంచ్ రాంబాబు తదితరులు

గుమ్మిలేరులో ఫ్యామిలీ డాక్టర్

ప్రజాశక్తి - ఆలమూరు

మండలంలోని చొప్పెల్ల పిహెచ్‌సి పరిధిలోని గుమ్మిలేరులో సోమవారం ఫ్యామిలీ డాక్టర్ కార్యక్రమాన్ని నిర్వహించారు. గ్రామాల్లోని ప్రతి ఒక్కరికీ ఆధునిక వైద్యం అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం కార్యక్రమాన్ని నిర్వహిస్తోందని సర్పంచ్ గుణ్ణం రాంబాబు, ఫ్యామిలీ డాక్టర్ ప్రోగ్రాం నోడల్ ఆఫీసర్ డాక్టర్ ఎం.సుమలత, వైద్యాధికారులు డాక్టర్ సువర్చల నాయుడు, డాక్టర్ మల్లికార్జున రావు అన్నారు. కాకినాడ రంగరాయ వైద్య కళాశాల నుంచి వచ్చిన వైద్య నిపుణుల బందం ఆధ్వర్యంలో గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి వివిధ రకాల వైద్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో వైద్య కళాశాల సిబ్బంది డాక్టర్ సుజాత, డాక్టర్ శ్రీదేవి, డాక్టర్ శ్రావణి, డాక్టర్ సుశీల, వైద్య సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

పలువురు తహశీల్దార్ల బాధ్యతల స్వీకరణ

ఎన్నికల నేపథ్యంలో బదిలీలపై వచ్చిన పలువురు తహశీల్దార్లు సోమవారం బాధ్యతలు స్వీకరించారు.

ప్రజాశక్తి-యంత్రాంగం

ఉప్పలగుప్తం తహశీల్దార్‌గా టి.మల్లికార్జునరావు బాధ్యతలు స్వీకరించారు. మచిలీపట్నం కలెక్టరేట్‌లో ఎఒగా పని చేస్తూ తహశీల్దార్‌గా ఇక్కడికి వచ్చారు. ఇప్పటివరకు ఇక్కడ తహశీల్దార్‌గా బాధ్యతలు నిర్వహించిన జవ్వాది వెంకటేశ్వరి భీమవరం జిల్లా ఆకివీడు తహశీల్దార్ గా బదిలీపై వెళ్లారు. **ముమ్మిడివరం** తాహశీల్దార్‌గా శ్రీను నాయక్ తాహశీల్దార్ కార్యాలయంలో బాధ్యతలు చేపట్టారు. కృష్ణా జిల్లా గుడివాడ ఆర్‌డిఒ కార్యాలయంలో ఆయన ఎఒగా పని చేస్తూ బదిలీపై వచ్చారు. ఇప్పటి వరకు ఇక్కడ పని చేసిన సిహెచ్.విజయశ్రీ పశ్చిమ గోదావరి జిల్లా యలమంచిలికి బదిలీ అయ్యారు. తహశీల్దార్‌కు కార్యాలయ సీనియర్ అసిస్టెంట్ మన్యం, ఆర్‌ఐ లలిత, సోనీ అభినందనలు తెలిపారు. **ఆలమూరు** తహశీల్దారుగా ఎ.గోపాలకృష్ణ బాధ్యతలు స్వీకరించారు. ఆయన కృష్ణాజిల్లా నుంచి బదిలీపై వచ్చారు. ఇప్పటివరకు విధులు నిర్వహించిన తహశీల్దార్ ఐపి.శెట్టి భీమవరం బదిలీపై వెళ్లారు. **రామచంద్రపురం** ఎన్నికల బదిలీల్లో భాగంగా కె.గంగవరం మండలం తహశీల్దారుగా బి.రవీంద్రనాథ్ సోమవారం బాధ్యతలు చేపట్టారు. ఆయన గోపాలపురం మండలం నుంచి బదిలీపై వచ్చారు. ఆయనను కార్యాలయ సిబ్బంది కలిసి అభినందనలు తెలిపారు. ఇప్పటివరకు ఇక్కడ పని చేసిన వైద్యనాథ్ శర్మ అమలాపురం బదిలీపై వెళ్లారు.

ఆలమూరులో బాధ్యతలు స్వీకరించిన గోపాలకృష్ణ

నిరుపయోగంగా ఉన్న టాయిలెట్స్

నిరుపయోగంగా పబ్లిక్ టాయిలెట్స్

ప్రజాశక్తి-మండపేట

మండపేట పట్టణ పరిధిలోని బైపాస్ రోడ్డు పెద్ద వంతెన, కృష్ణ టాకీస్ ఎదురుగా, ఏడిద రోడ్డులోని ఆటో స్టాండ్ సమీపంలో నిర్మించిన పబ్లిక్ టాయిలెట్స్ నిరూపయంగా మారాయి. పట్టణ పరిశుభ్రతలో భాగంగా గత ప్రభుత్వంలో వీటిని నిర్మించినప్పటికీ ప్రస్తుతం ఇవి వినియోగం లేకపోవడంతో పాడైపోతున్నాయి. వీటిని వినియోగంలో తీసుకురావడంతో పట్టణ పరిశుభ్రతతో పాటు ప్రయాణికులకు ఇవి ఉపయోగపడతాయని పలువురు అంటున్నారు. ఇప్పటికైనా మున్సిపల్ అధికారులు తక్షణ చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

గోతులమయంగా ఉన్న ఏడిద రోడ్డు

గోతులైనా పూడ్చండి మహాప్రభో

ప్రజాశక్తి-మండపేట

నిత్యం రద్దీగా ఉండే మండపేట నుంచి ఏడిద వెళ్లే రోడ్డు అభివృద్ధి మాట ఎలా ఉన్నా కనీసం గోతులైన పూడ్చాలని వాహనదారులు స్థానిక ప్రజలు, ప్రభుత్వానికి మొరపెట్టుకుంటున్నారు. ఈ రోడ్డు పెద్ద పెద్ద గోతులతో ప్రమాదాలకు నిలయంగా మారిందని గోతులను తప్పించే ప్రయత్నంలో ప్రమాదాలకు గురవుతున్నామని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఏడిద గ్రామం నుండి బైపాస్ రోడ్డు వరకు ఇటీవల కాలంలో మరమ్మతులు చేపట్టినప్పటికీ ఇటీవల కురిసిన వర్షాలకు రోడ్డు పాడైపోయిందని ప్రజలు అంటున్నారు. స్థానిక బైపాస్ రోడ్డు నుంచి మండపేట కలువపువ్వు సెంటర్ జంక్షన్ వరకు రోడ్డు మరింత అధ్వానంగా మారిందనిఅంటున్నారు. రోడ్డు అభివద్ధి మాట ఎలా ఉన్నా కనీసం గోతులైన పూడ్చి ప్రాణాలను కాపాడాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు. రోడ్డు అంతా దుమ్ముమయంగా మారుతుండటంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని ప్రజలు అంటున్నారు.

రాపాక కుటుంబానికి జవహర్ పరామర్శ

ప్రజాశక్తి - తాళ్లపూడి

పుత్ర వియోగంతో బాధపడుతున్న మలకపల్లి సర్పంచ్ రాపాక రాజేశ్వరి కుటుంబాన్ని మాజీ మంత్రి జవహర్ సోమవారం పరామర్శించారు. రాజేశ్వరి కుమారుడు టిడిపి జిల్లా శాఖ ఉపాధ్యక్షులు బాలగంగాధర్‌తిలక్ ఇటీవల ఆకస్మిక మరణం పొందారు. ఈ సందర్భంగా తిలక్ చిత్రం పటం జవహర్ నివాళులర్పించారు. ఈ సందర్భంగా జవహర్ మాట్లాడుతూ తిలక్ కుటుంబానికి పార్టీ అండగా ఉంటుందన్నారు. ఆయన వెంట టిడిపి నాయకులు మద్దిపాటి ప్రకాశం, మద్దిపాటి రామారావు, టి.గోపి, సిహెచ్.వెంకట్రావు తదితరులున్నారు.

ఓట్ ఫర్ ఒపిఎస్ పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-కడియం

ఏ రాజకీయ పార్టీ అయితే వచ్చే ఎన్నికల్లో ఉద్యోగుల ఒపిఎస్‌కు మద్దతిస్తుందో దానికే ఓటేస్తామని యుటిఎఫ్ జిల్లా కోశాధికారి ఇవివిఎస్ఆర్.ప్రసాద్ పేర్కొన్నారు. యుటిఎఫ్ ఆధ్వర్యంలో ఓట్ ఫర్ ఒపిసి పోస్టర్‌ను యుటిఎఫ్ నాయకులు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ప్రసాద్ మాట్లాడుతూ ఇప్పటికే చాలా రాష్ట్రాలు ఒపిఎస్ వైపు మళ్లుతున్నాయన్నారు. ఒపిఎస్ నినాదం వచ్చే ఎన్నికల్లో జాతీయ స్థాయి నినాదం కాబోతుందన్నారు. యుటిఎఫ్ అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు అబ్బాయి, వేదుల శాస్త్రి, రాష్ట్ర కౌన్సిలర్ ఎస్ అనిత, నాయకులు లక్ష్మణకుమార్, వనజ, భద్రరావు, హనుమంతరావు, పాల్గొన్నారు.

ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం

ప్రజాశక్తి-గోకవరం

పార్టీలో ప్రతి ఒక్కరికీ సముచిత స్థానం కల్పిస్తామని జ్యోతుల నవీన్ కుమార్ అన్నారు. తంటికొండలో సోమవారం 50 మంది టిడిపిలో చేరారు. వారికి నవీన్‌కుమార్ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా నవీన్ మాట్లాడారు. నెహ్రూ సమర్థమైన నాయకత్వం కలిగిన నాయకుడన్నారు. నెహ్రూతోనే జగ్గంపేట నియోజకవర్గ అభివృద్ధి సాధ్యమన్నారు. పార్టీలోకి ఎవరొచ్చినా వారికి ప్రత్యేక గుర్తింపు ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి, జనసేన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

నానికి జ్యోతుల నవీన్ పరామర్శ

ప్రజాశక్తి-గోకవరం

ఇటీవల అనారోగ్యానికి గురైన తంటికొండ గ్రామానికి చెందిన టిడిపి సీనియర్ నాయకులు బద్ధిరెడ్డి నానిని టిడిపి జిల్లా అధ్యక్షులు, జడ్‌పి మాజీ చైర్మన్ జ్యోతుల నవీన్‌కుమార్ సోమవారం పరామర్శించారు. ఆరోగ్యంపై ఆరా తీశారు. యోగ క్షేమాలు అడిగి తెలుసుకొన్నారు. నవీన్ వెంట గోకవరం సోసైటీ మాజీ చైర్మన్ గాజింగం సత్తిబాబు, తండకొండ దేవస్థాన మాజీ చైర్మన్ బదిరెడ్డి అచ్చున్నదొర, మలిరెడ్డి సిరి, దాసరి సీతారామకృష్ణ, బద్ధిరెడ్డి రవి, గెడ్డం బాబు తదితరులున్నారు.

వెహికల్ షెడ్డు ప్రారంభం

ప్రజాశక్తి - చాగల్లు

పూర్వ విద్యార్థుల సహకారంతో నిర్మించిన వెహికల్ షెడ్డును సోమవారం ప్రారంభించారు. ఊనగట్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన1982-87 సంవత్సరం విద్యార్థులు సహకారంతో ఉపాధ్యాయుల వాహనాల కోసం నిర్మించిన షెడ్‌ను గ్రామ పెద్ద నల్లూరి ధర్మరాజు, పాఠశాల అభివృద్ధి కమిటీ అధ్యక్షులు నందిగం శ్రీను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పూర్వ విద్యార్థుల కృషి అభినందనీయమన్నారు.

మంత్రి పెద్దిరెడ్డి వ్యాఖ్యలకు కాంగ్రెస్ ఖండన

ప్రజాశక్తి-అమలాపురం రూరల్

మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి చేసిన వ్యాఖ్యలను కాంగ్రెస్ నాయకులు తీవ్రంగా ఖండించారు. సోమవారం అమలాపురం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో నిర్వహించిన పత్రికా విలేకరుల సమావేశంలో జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కామన ప్రభాకరరావు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీని శవంతో పోల్చిన పెద్దిరెడ్డి రాజకీయ జీవితం ఎక్కడ ప్రారంభమైందో గుర్తుంచుకుని మాట్లాడటం మంచిదన్నారు. తనకు రాజకీయ భిక్ష పెట్టిన తల్లి లాంటి కాంగ్రెస్ పార్టీని విమర్శించటం ఆయన దిగజారుడుతనానికి నిదర్శనమన్నారు. ఇప్పటికైనా బుద్ధి తెచ్చుకుని చేసిన వ్యాఖ్యలను వెనక్కి తీసుకుని కాంగ్రెస్ పార్టీకి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పిసిసి ఛీఫ్ వైఎస్.షర్మిళపై ఏ విధమైన వ్యాఖ్యలు చేసినా చూస్తూ ఊరుకోబోమని కామన హెచ్చరించారు. సిడబ్ల్యూసి సభ్యులు డాక్టర్ ఎన్.రఘువీరారెడ్డి, కెవిపి రామచంద్రరావు, గిడుగు రుద్రరాజును విమర్శించే అర్హత మంత్రి పెద్దిరెడ్డికి లేదన్నారు. పార్టీ పార్లమెంటరీ నియోజకవర్గ కో ఆర్డినేటర్ మట్టా వెంకట శివ ప్రసాద్, పట్టణ అధ్యక్షులు వంటెద్దు బాబి, పిసిసి జనరల్ సెక్రెటరీ మహమ్మద్ ఇస్మాయిల్ ఆరిఫ్, జిల్లా బిసి సెల్ అధ్యక్షులు కుడిపూడి శ్రీను, ఎస్సీ సెల్ అధ్యక్షులు వడ్డి నాగేశ్వరరావు, సంసాని రామకృష్ణ, రౌతు ఈశ్వరరావు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న కాంగ్రెస్ నాయకులు

భవనాన్ని పారంభిస్తున్న ఎంఎల్ఎ సతీష్ కుమార్

నిత్యాన్నదాన భవనం ప్రారంభం

ప్రజాశక్తి-ఐ.పోలవరం

మురమళ్ల గ్రామ పంచాయితీ పరిధిలో ఉన్న వీరేశ్వరస్వామి ఆలయ ప్రాంగణంలో నిత్యాన్నదాన భవనాన్ని సోమవారం ఎంఎల్‌ఎ సతీష్ కుమార్ ప్రారంభించారు. 2009లో సూర్యబలిజ కాశీ వంశీయుల దాతత్వంతో అందించిన స్థలంలో సూర్య బలిజ నిత్యాన్నదానం భవనాన్ని రూ.55 లక్షల నిధులతో, రూ.4 లక్షల నిధులతో గోకులం షెడ్ నిర్మించారు. నలుగురు రూ.9 లక్షలతో స్టెయిన్‌లెస్ స్టీల్ టేబుల్స్‌ను అందించారు. మాచిరాజు పావని లక్ష్మీకాంతం జ్ఞాపకార్థం ఖమ్మం జిల్లాకు చెందిన కొల్లి రాజేష్, రూ.3 లక్షలు, అనాతవరానికి చెందిన నూకలు సూర్యనారాయణ రూ.4 లక్షలు, అన్న ప్రసాదం స్టీమ్‌ను, వంట గదుల నిర్మాణానికి విరాళంగా ఇచ్చారు. కాళి వారి కుటుంబసభ్యులను ఎంఎల్‌ఎ సతీష్ కుమార్ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కార్యనిర్వహణాధికారి మాచిరాజు లక్ష్మి నారాయణ ఆధ్వర్యాన ఎంపిపి మోర్త రాణి మిరియం జ్యోతి, జెడ్‌పిటిసి సభ్యుడు ముదునూరి సతీష్ రాజు, స్థానిక సర్పంచ్ కాళే రాజబాబు, దేవస్థానం చైర్మన్ పెన్మత్స వాసురాజు, వైసిపి మండల కన్వీనర్ పిన్నమరాజు వెంకటపతి రాజు, మాజీ ఎంఎల్‌ఎ దాట్ల బుచ్చిబాబు, గంగాబాబు, మోర్త చిన్న, దేవాదాయ సహాయ కమిషనర్ ప్రసాద్, అర్చకులు నాగాభట్ల రవి, యనమండ్ర సుబ్బారావు శర్మ పాల్గొన్నారు.

చిలుకూరికి 'తెలుగు భాషా సేవా రత్న' పురస్కారం

ప్రజాశక్తి- కడియం

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ అధికార భాష సంఘం ఆధ్వర్యంలో కడియానికి చెందిన రచయిత చిలుకూరి శ్రీనివాసరావు సోమవారం తెలుగు భాషా సేవా రత్న పురస్కారం అందుకున్నారు. అధికార భాషా సంఘం, నాగార్జున విశ్వవిద్యాలయం, ప్రవాసాంధ్ర తెలుగు సంఘం సంయుక్త ఆధ్వర్యంలో పత్రికా రంగంలో విశేష సేవలు అందిస్తున్న పలువురు ప్రముఖులకి తెలుగు భాష సేవ రత్న పురస్కారాలను అందించారు. గుంటూరు నాగార్జున విశ్వవిద్యాలయం ప్రాంగణంలో నిర్వహించిన కార్యక్రమంలో వీటిని ప్రదానం చేశారు. వివిధ దినపత్రికల్లో శ్రీనివాసరావు రాస్తున్న వ్యాసాలకుగాను ఈ అవార్డును అందుకున్నారు. అధికార భాషా సంఘం అధ్యక్షులు పి.విజయబాబు, ప్రెస్ అకాడమీ పూర్వపు అధ్యక్షులు కొమ్మినేని శ్రీనివాసరావు, పద్మశ్రీ కొలకలూరి ఇనాక్, సినీ దర్శకులు తమ్మారెడ్డి భరద్వాజ్, ఆచార్య నాగార్జున యూనివర్సిటీ విసి డాక్టర్ రాజశేఖర్ చేతుల మీదుగా చిలుకూరి పురస్కారాన్ని అందుకున్నారు.

అవార్డు అందుకుంటున్న చిలుకూరి శ్రీనివాసరావు

కళలతోనే సమాజ వికాసం సాధ్యం

ప్రజాశక్తి - రాజానగరం

కళలతోనే సమాజ వికాసం సాధ్యమని వైసిపి కేంద్ర కమిటీ సభ్యులు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. నన్నయ విశ్వవిద్యాలయం ఎన్‌టిఆర్ కన్వెన్షన్ హాల్లో ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనారిటీ విద్యార్థుల ట్రైబల్ స్టూడెంట్ ఫెడరేషన్ (టిఎస్ఎఫ్) ఆధ్వర్యంలో రెండు రోజులు జాతీయ స్థాయి ఆదివాసీల సాంస్కృతిక మహోత్సవాలు సోమవారం ఘనంగా ప్రారంభ మయ్యాయి. ఈ సందర్భంగా వ్యవస్థాపక అధ్యక్షుడు డాక్టర్ మల్లిభాస్కర్ అధ్యక్షత ఏర్పాటు చేసిన సభకు ముఖ్య అతిథిగా విజయలక్ష్మి హాజరయ్యారు. జ్యోతి ప్రజ్వలన చేసి కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఆమె మాట్లాడుతూ గిరిజన సంస్కృతి సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. టిఎస్ఎఫ్ జాతీయ అధ్యక్షుడు కె.అక్కులప్పనాయక్, రాష్ట్ర అధ్యక్షుడు చంద్రప్ప, రాష్ట్ర కార్యదర్శి విష్ణునాయక్ మాట్లాడుతూ నేటికీ గిరిజనులు అభివృద్ధికి దూరంగా ఉన్నారన్నారు. గిరిజన సంస్కృతి, సంప్రదాయాలను కాపాడుకోవాలన్నారు. రిజిస్ట్రార్ సుధాకర్ మాట్లాడుతూ సంస్కృతి సంప్రదాయాలకు గిరిజన నాగరికత అద్దం పడుతుందన్నారు సైన్స్ కళాశాల ప్రిన్సిపల్ విజయనిర్మల మాట్లాడుతూ విద్య తోనే పేదరికంపై విజయం సాధించొచ్చన్నారు. ప్రభుత్వ పథకాలను గిరిజనులు సద్వినియోగం చేసుకోవాలన్నారు ఈ కార్యక్రమంలో డాక్టర్ పల్లాల రాజ్ కుమార్ రెడ్డి, రాష్ట్ర అధ్యక్షుడు రామగిరి చెంద్రప్ప, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు అజ్మీర్ నరేష్ పాల్గొన్నారు.

ఆకాశాన్నంటిన అల్లం ధర

ప్రజాశక్తి-మండపేట

అన్ని రకాల వంటకాలలో మసలతో పాటు విరివిరిగా వినియోగించే అల్లం ధర ఆకాశాన్ని అంటుతోంది. హోల్‌సేల్ మార్కెట్లో రూ.120కాగా రిటైల్ మార్కెట్లో రూ.140 పలుకుతోంది. ప్రధానంగా ప్రజల అవసరాల మేర అల్లం అందుబాటులో లేకపోవడం ఇతర జిల్లాలు, రాష్ట్రాల నుంచి దిగుమతి చేసుకుంటున్న నేపథ్యంలో అల్లం ధర అధికంగా ఉంటోందని వ్యాపారులు చెబుతున్నారు. ప్రధాన మార్కెట్లో కేజీ రూ.150 నుంచి రూ.160 వరకూ ఉండగా రైతు బజార్లో రూ.125 ఉంది. గతంలో దీని ధర రూ.250 నుంచి రూ.280 వరకు పలకడం గమనార్హం. ఈ నేపథ్యంలో మార్కెట్‌లో రూ.10 కూడా అల్లం ముక్క దొరకడం లేదు. అల్లంతో సమానంగా టమాటా, పచ్చిమిర్చి ధరలు ఆకాశం అంటేనప్పటికీ ప్రస్తుతం టమాటా రూ.30, పచ్చిమిర్చి రూ.36 పలుకుతున్నాయి. అల్లం తర్వాత చిక్కుడుకాయలు రూ.45 నుంచి రూ.50 పలుకుతుండడంతో సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇదిలా ఉండగా అల్లం ధరను దష్టిలో ఉంచుకుని కొందరు నకిలీ అల్లం పేస్ట్ ను తయారు చేస్తూ ప్రజారోగ్యాలను పాడు చేస్తున్నారు.

అభివృద్ధి పనుల అడ్డగింతపై దళితుల ధర్నా

సీతానగరం : దళిత వాడలో డ్రెయినేజీ నిర్మాణాన్ని జడ్‌పిటిసి భర్త చల్లమళ్ల సుజీరాజు అడ్డుకోవడంపై దళితులు ధర్నాకు దిగారు. సోమవారం సీతానగరం ఎంపిడిఒ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. సీనియర్ అసిస్టెంట్ శ్రీనివాస్‌కి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గత నెల 20న రామచంద్రపురం దళిత కాలనీలో డ్రెయినేజీ నిర్మాణానికి నిధులు మంజూరయ్యాయని చెప్పి జడ్‌పిటిసి భర్త చల్లమళ్ల సుజీరాజు సచివాలయం ఇంజనీరింగ్ అసిస్టెంట్‌తో కలిసి వీధుల్లో పర్యటించి, పనులు అంచనాలు తయారు చేశారన్నారు. అయితే ఇక్కడ డ్రెయినేజీని నిర్మించకుండా వేరే ప్రాంతానికి తరలించారన్నారు. దీనిపై సుజీరాజును ప్రశ్నిస్తే దూషించమే కాకుండా దిక్కున్నచోట చెప్పుకోమని అన్నారని తెలిపారు.

ఏకలవ్యుని విగ్రహం ఆవిష్కరణ

సీతానగరం : కాటవరంలో ఏర్పాటు చేసిన ఏకలవ్యుని విగ్రహాన్ని వైసిపి జిల్లా యువజన నాయకుడు జక్కంపూడి గణేష్ సోమవారం ఆవిష్కరించారు. విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మండల ఎరుకుల సంఘం నాయకులు మాట్లాడుతూ విగ్రహదాత, వైసిపి మండల కో-కన్వీనర్ కరుటూరి శ్రీహరిబాబుకు కృతజ్ఞతలు తెలిపారు. శ్రీహరిబాబు మాట్లాడుతూ బడుగు బలహీన వర్గాలకు పెద్దపీట వేస్తూ అభివద్ధి పథంలో నడిపించేందుకు ఎంఎల్‌ఎ జక్కంపూడి రాజా చొరవతో మండలంలో కషి చేస్తున్నామన్నారు. ఎరుకుల దిబ్బగా పిలవబడే ఈ ప్రాంతాన్ని వారి గౌరవం పెంచేలా ఏకలవ్యుని కాలనీగా నామకరణం చేసేందుకు పంచాయతీలో తీర్మానం చేస్తామని హామీ ఇచ్చారు. గణేష్ మాట్లాడుతూ ఎరుకుల సంఘానికి సహకారం అందిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి గుర్రాల జోత్స్న, వైసిపి మండల కన్వీనర్ గంటా శ్రీనివాస్, వైస్ ఎంపిపి సత్యం మదన్‌మోహన్ బాబు, ఆత్మ కమిటీ చైర్మన్ పెదపాటి డాక్టర్ బాబు, ఎంపిటిసి సభ్యులు తాడేపల్లి వెంకట్రావు పాల్గొన్నారు.

వెలివేత ఘటనలో కులపెద్దలకు కౌన్సెలింగ్

ప్రజాశక్తి - సీతానగరం

కులకట్టుబాట్లతో కుటంబాన్ని వెలివేసిన ఘటనలో సీతానగరం ఎస్ఐ రామకృష్ణ, విఆర్ఒ, సిబ్బందితో కలసి బాధిత కుటుంబానికి అండగా నిలిచారు. చినుకొండేపూడి గ్రామంలో వడ్డీలపేటలో కుల పెద్దలను పిలిపించి మాట్లాడారు. వారికి కౌన్సిలింగ్ ఇచ్చారు. సుబ్బమ్మ కుటుంబాన్ని వెలివేయడంపై పెద్దలను హెచ్చరించారు. ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా కుల పెద్దలను హెచ్చరించారు. బాధితులు సంతప్తి చెందడంతో ఎస్ఐ రామకృష్ణకు కృతజ్ఞతలు తెలిపారు.

కొత్తపేటలో ప్రచారం చేస్తున్న కాంగ్రెస్ పార్టీ నాయకులు

కాంగ్రెస్‌తోనే ప్రజాస్వామ్య పాలన

ప్రజాశక్తి-కొత్తపేట

కాంగ్రెస్ అధికారంలోకి వస్తేనే ప్రజాస్వామ్యం బతికి బట్టకడుతుందని ప్రజలు ఆశతో ఎదురు చూస్తున్నారని కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ అసెంబ్లీ కన్వీనర్ ముషిణి రామకృష్ణారావు అన్నారు. వారం రోజులుగా కొత్తపేట అసెంబ్లీ నియోజక వర్గంలో ఇంటింటా కాంగ్రెస్ పేరున కాంగ్రెస్ కార్యకర్తలతో కలిసి ఆయన పర్యటిస్తున్నారు. రాబోయే ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీని తప్పక గెలిపించాలని ప్రజలను ఆయన కోరారు. 2019 ఎన్నికల్లో తాను కొత్తపేట నుంచి పోటీ చేశాను కనుక ప్రజలతో సత్సంబంధాలు కలిగి ఉన్నాయన్నారు. కాంగ్రెస్ పార్టీ అధిష్టానం ఆదేశిస్తే ఈసారి మళ్లీ పోటీ చేయడానికి సిద్ధంగా ఉన్నానని ముషిణి తెలిపారు. ఈ కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు పి.ఉదయ భాస్కరవర్మ, కాంగ్రెస్ నాయకులు ఎన్.నాగేశ్వరరావు, సలాది వెంకటానందం, మేడిశెట్టి సురేష్, ఎం.రమేష్, దొమ్మేటి వెంకటేష్, యూత్ కాంగ్రెస్ నాయకుడు ఎం.లక్ష్మణ్, యల్లమిల్లి వెంకటేశ్వరరావు, వై.ధనరాజు పాల్గొన్నారు.

అయినవిల్లి ఎస్ఐగా రాజేష్ కుమార్

ప్రజాశక్తి-అయినవిల్లి

ఎస్ఐగా వి.రాజేష్ కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల బదిలీల్లో భాగంగా ఎస్ఐగా పని చేసిన సురేష్ బాబు బదిలీపై రామచంద్ర పురం వెళ్లగా ఆయన స్థానంలో రాజేష్ కుమార్ వచ్చారు. ఈ సందర్భంగా ఆయనను పోలీస్ సిబ్బంది, పలువురు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలియజేశారు.

ఆత్రేయపురం ఎస్ఐగా శ్రీనివాస్

ప్రజాశక్తి-ఆత్రేయపురం

ఆత్రేయపురం ఎస్ఐగా ఎస్.శ్రీనివాసు సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఆయన పాలకొల్లు రూరల్ స్టేషన్ నుంచి ఇక్కడికి బదిలీపై వచ్చారు. ఆయన మాట్లాడుతూ మండలం గ్రామాల్లో శాంతి భద్రతలకు విఘాతం కలగకుండా చర్యలు తీసుకుంటానని తెలిపారు. కోడి పందేలు, పేకాట వంటి అసాంఘిక కార్యక్రమాలపై కఠిన చర్యలు తప్పవని చెప్పారు.

అభివృద్ధి పేరుతో ఎంపీ భరత్ వ్యాపారం

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కాసులకు కక్కుర్తిపడి... కమీషన్లకు అలవాటు పడిన రాజమండ్రి ఎంపీ మార్గాని భరత్‌రామ్ అభివృద్ధి ముసుగులో వ్యాపారం చేస్తున్నారని టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆరోపించారు. జెఎన్ రోడ్డు వెంకటేశ్వర నగర్‌లోని వాకర్స్ పార్క్ వద్ద ఆయన మీడియాతో సోమవారం మాట్లాడారు. సుబ్రహ్మణ్యం మైదానానికి ఎంతో ప్రాముఖ్యత ఉంది... దాని గురించి ప్రత్యేకంగా చెప్పాల్సి అవసరం లేదన్నారు. చారిత్రాత్మక సభలు, సమావేశాలకు అది నిలయమన్నారు. అంటువంటి ప్రాధాన్యత కలిగిన మైదానంలో బ్లేడ్ బ్యాచ్ ఉంటోందన్నారు. ఆ ప్రాంగణాన్ని అభివృద్ధి చేస్తున్నాని ఎంపీ భరత్ రామ్ అన్నారన్నారు. దీని బట్టి చూస్తే అతని అసమర్థతను ఆయనే ఒప్పుకున్నట్టు అయ్యిందన్నారు. సుబ్రహ్మణ్య మైదానంలో రూ.5 కోట్లతో అభివృద్ధి చేసి స్క్రీన్ ఏర్పాటు చేయడం ఎంత వరకూ సమంజసమని ప్రశ్నించారు. ఆర్ట్స్ కళాశాల మైదానంలో కూడా స్టేడియం నిర్మాణం చేస్తానంటే అఖిల పక్షం నేతలు, విద్యార్థులు ఉద్యమిస్తే ఆ నిర్ణయాన్ని వెనక్కి తీసుకున్నారని గుర్తు చేశారు. తన వ్యాపారాన్ని పెంచుకునేందుకు ప్రతి సమావేశం, సభ తన మార్గాని ఎస్టేట్‌లోనే పెట్టుకునే విధంగా భవిష్యత్తు వ్యాపారం కోసం నగరంలో ఉన్న అన్ని ఖాళీ స్థలాల్లో అభివృద్ధి పేరుతో ఎంపీ మార్గాని భరత్ రామ్ ఇలా నిర్మాణాలు చేస్తున్నారని చెప్పారు. మార్గాని ఎస్టేట్ వైపే అందరూ చూసేలా తెలివైన వ్యాపారానికి మార్గాని తెరలేపారన్నారు. ఈ విషయాలన్నీ నగర ప్రజలు గమనించాలని కోరారు.

కనీస పెన్షన్ కోసం నిరసన దీక్ష

ప్రజాశక్తి - రాజమహేంద్రవరం

కనీస పెన్షన్ రూ.9వేలు ఇవ్వాలంటూ ఇపిఎఫ్ఒ-95 పెన్షనర్స్ స్థానిక మోరంపూడి జంక్షన్ దగ్గర ఉన్న పిఎఫ్ కార్యాలయం వద్ద నిరసన దీక్షలు చేపట్టారు. ఈ నిరసన దీక్షలను ఉదేశించి అసోసియేషన్ అధ్యక్షులు సిహెచ్. మోహనరావు మాట్లాడారు. కనీసం పింఛను రూ.9వేలు ఇవ్వాలన్నారు.,ార్య, భర్తలకి వైద్య సదుపాయం కల్పించాలని డిమాండ్ చేశారు. సినియర్ సిటిజన్స్‌కు రైల్వేలో రాయితీ కల్పించాలని, హైయ్యర్ పెంక్షన్ అమలు చేయాలన్నారు. పార్లమెంట్ సమావేశాలు జరిగే 5 రోజులు దీక్షలు నిర్వహిస్తామని తెలిపారు. నేటి దీక్షలో ఆర్‌టిసి రిటైర్డ్ ఉద్యోగులు పాల్గొన్నారని తెలిపారు. ఈ దీక్షలకు సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఎస్-ఎస్.మూర్తి, కెఎస్.వి.రామచంద్రరావు హాజరై మద్దతు తెలిపారు. ఈ దీక్షల్లో మంగరాజు, సుధాకర్, కెవి.రావు, దేవర, సుబ్బారావు, ప్రకాష్ రావు, రాజు, నాగేశ్వరావు, నారాయణ, ఇంద్రవేణి, గంగమ్మ తదితరులు పాల్గొన్నారు.

MUNICIPAL CORPORATION
RAJAMAHENDRAVARAM
ENGINEERING SECTION
e-Procurement Tender Notice
NIT No: 518 to 523 and 525 to 548 and 550 to 566, 569, 399/MCR/General/2023-24 and 568/MCR/GGMP/2023-24
Dt. 01-02-2024
Online tenders are invited from the eligible contractors on e-procurement for 55 works for with an Estimated Contract Value of Rs. 3,89,51,379/-
1. Tenders can be down loaded. The tender schedules for the above works will be available from 01-02-2024 at 11.30 P.M on wards.
2. Last date of time of receipt of tenders details can be seen at 'e'-procurement website www.apeprocurement.gov.in & https://tender.apeprocurement.gov.in
Sd/- K.DINESH KUMAR, IAS
Commissioner
Municipal Corporation, Rajamahendravaram

యానాం వార్తలు

చర్చల్లో పాల్గొన్న సిఐటియు దుర్గాప్రసాద్, కార్మికులు, రైస్ మిల్స్ యాజమాన్యం

రైస్ మిల్లు కార్మికుల చర్చలు సఫలం

ప్రజాశక్తి - యానాం

రైస్ మిల్ కార్మికుల నూతన వేతన ఒప్పందానికి సంబంధించి సోమవారం లేబర్ కార్యాలయంలో నిర్వహించిన చర్చలు సఫలమయ్యాయి. మూడవసారి చర్చల్లో కార్మికుల తరపున సిఐటియు జిల్లా కార్యదర్శి గుదే దుర్గాప్రసాద్, రైస్ మిల్స్ తరపున కంచర్ల చిన్నబ్బాయి, దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా కార్యదర్శి జి.దుర్గాప్రసాద్ మాట్లాడుతూ కార్మికుల డిమాండ్లను ఒప్పుకున్నందుకు రైస్ మిల్స్ యాజమాన్యానికి కృతజ్ఞతలు తెలిపారు. లేబర్ ఇన్స్పెక్టర్ దయానిధి ఆధ్వర్యంలో చర్చలు సఫలమయ్యాయి అని తెలిపారు. ఈ సందర్భంగా ఆయనకు కతజ్ఞతలు తెలిపారు. గతంతో పోలిస్తే టన్నుకి రూ.ఐదు పెంచారని మొత్తం బిల్ మీద 15 శాతం పెరిగిందన్నారు. సిఐటియు ఆధ్వర్యంలో గతంలో రుంగ్ట కార్మికుల తరపున పోరాడి విజయం సాధించామని, ఇప్పుడు రైస్ మిల్ కార్మికుల తరపున పోరాడి మరోసారి విజయం సాధించామన్నారు. కార్మికుల సమస్యలపై సిఐటియు పోరాడుతుందన్నారు. ఈ సందర్భంగా రైస్ మిల్ కార్మికులు సిఐటియుకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రైస్ మిల్ వర్కర్స్ యూనియన్ నాయకులు సలాది నాగబాబు, దాసరి రాజు, సబ్బతి రాంబాబు, కొప్పిశెట్టి నాగేశ్వరరావు, యాళ్ల సత్తిబాబు, తిరుకోటి శ్రీను పాల్గొన్నారు.

7న విద్యుత్ సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - యానాం

ఎపి ట్రాన్స్‌కో, కాకినాడ శాఖ ఆధ్వర్యంలో అదనపు హైటెన్షన్ వైర్ల మరమ్మతుల కారణంగా ఈ నెల 7వ తేదీ బుధవారం ఉదయం 9 నుంచి సాయంత్రం 4 గంటల వరకు యానాం నియోజవర్గంలోని అన్ని ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఎఇ లంక కృష్ణారావు సోమవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ వినియోగదారులు సహకరించాలని కోరారు.

సమావేశంలో మాట్లాడుతున్న వైసిపి నాయకులు

'వైసిపి కార్యకర్తలు టిడిపిలో చేరలేదు'

ప్రజాశక్తి-మండపేట

మండలంలోని ఏడిద గ్రామం నుంచి వైసిపి కార్యకర్తలు ఎవరు టిడిపిలో చేరలేదని వైస్ ఎంపిపి పసుమర్తి నాగేశ్వరావు అన్నారు. సోమవారం ఏడిద గ్రామంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వైసిపి గ్రామ అధ్యక్షుడు రాష్ట్ర కార్యదర్శి పలివెల సుధాకర్, బేత వెంకటేశ్వరరావుతో కలిసి వారు మాట్లాడారు. వైసిపి ప్రభుత్వం పేద ప్రజల కోసం ఎన్నో సంక్షేమ పథకాలు అమలు చేస్తోందన్నారు. ప్రజాదరణ పొందిన పార్టీ వైసిపి అన్నారు. రానున్న ఎన్నికల్లో 175 సీట్లు సాధించి విజయభేరి ముగిస్తుందని చెప్పారు.

KANAKADURGA
FINANCE LIMITED
(RBI ద్వారా గుర్తింపు పొందినది)
బ్రాంచిఆఫీస్: 2-1-81, ఫస్ట్‌ఫ్లోర్, హనుమాన్ కాంప్లెక్స్, కెఎన్ఎఫ్ మెయిన్‌రోడ్డు, ఖజానా జ్యూయలరీ ప్రక్కన, అమలాపురం.
- ఫస్ట్‌ఫ్లోర్, పద్మజ థియేటర్ రోడ్డు, మల్కిపురం
- ఫస్ట్‌ఫ్లోర్, ద్వారకా కాంప్లెక్స్, బస్టాప్ ఎదురు, విక్టరీ గార్డెన్ ప్రక్కన, రావులపాలెం.
- డోర్ నెం.6-7-21/8, ఫస్ట్‌ఫ్లోర్, సాయికాంప్లెక్స్, వివేక జూ॥ కాలేజి ఎదురు, బాలాజీరోడ్డు, తుని - 533401. ఫోన్: 9121068612
బంగారు వేలం ప్రకటన
ఈ ప్రకటన ద్వారా ప్రజలకు తెలియజేయునది ఏమనగా ది. 24-02-2024 ఉ॥ 10-00 గం॥లకు మా బ్రాంచి ఆఫీసు నందు 1736.0 గ్రాముల వస్తువులు కుదవపెట్టిన పాత బంగారం నగలు హెడ్డాఫీసు : డోర్ నెం.54-9-23, 100 అడుగుల రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7 నందు వేలం వేయబడుతున్నాయి. వేలం వేయబడుతున్న నగలు వినియోగదారులు సమయం దాటిపోయిన విడిపించు కోకుండా వదిలిపెట్టిన నగలు అప్పులు తీసుకున్న వారందరికీ మా వేలం నోటీసులు రిజిష్టర్ పోస్టుద్వారా పంపించడం జరిగింది. వేలంలో పాల్గొనదలచిన వారు తమ అడ్రస్ ప్రూఫ్ మరియు ఐడి ప్రూఫ్ వెంటే తీసుకొని రావాలి. సెక్యూరిటీ డిపాజిట్ మరియు టోకెన్ ఇవ్వడం అనేది కంపెనీ నిర్ణయంపై ఆధారపడి ఉంటుంది. మరిన్ని వివరాలు మరియు నియమ నిబంధనల కొరకు దయచేసి విజయవాడలో మా హెడ్డాఫీసులో సంప్రదించండి.
అథరైజ్డ్ ఆఫీసర్
కనకదుర్గా ఫైనాన్స్ లిమిటెడ్
H.O. : 100 అ॥ రోడ్డు, ఆటోనగర్, విజయవాడ-7.
AMALAPURAM AREA CELL NO-80088 12798

ప్రకటన
మహారాజశ్రీ కొవ్వూరు
Principal Senior Civil Judge వారి కోర్టులో
EP No. : 64 / 2019
OS No. : 288 / 2011
DHR : ఉదయగిరి రవి కుమార్, తండ్రి : పద్మనాభం, వయస్సు : 45 సం.లు, పు॥, హిందూ, బిజినెస్, నివాసం : డి.నెం.3-11-10, నిడదవోలు టౌన్ & మండలం, ప.గో. జిల్లా. KVR. SCJC.
JDRS : 1. కోయి సుబ్బారావు, తండ్రి : రామారావు, వయస్సు : 58 సం.లు, పు॥, హిందూ, లారీ డ్రైవర్, నివాసం : డి.నెం. 2-7/1-14ఎ, 5వ వార్డు, చింతచెట్టు వీధి చివర, సంజీవయ్యనగర్, నిడదవోలు టౌన్, & మండలం, ప.గో.జిల్లా. KVR. SCJC.
2. కోయి పుష్పావతి @ సూర్య నాగ పుష్పావతి, భర్త : కోయి సుబ్బారావు, వయస్సు : 55 సం.లు, స్త్రీ, హిందూ, గృహిణీ, నివాసం : డి.నెం. 2-7/1-14ఎ, 5వ వార్డు, చింతచెట్టు వీధి చివర, సంజీవయ్యనగర్, నిడదవోలు టౌన్, & మండలం, ప.గో.జిల్లా. KVR. SCJC.
వేలం ప్రకటన
వేలం తేది : 22-02-2024
పై నంబరు గ్రంధములో డిక్రీ బాకీ వసూలు నిమిత్తం JDRS తాలూకు యీ దిగువ షెడ్యూలు దాఖలా స్థిరాస్తిని ది.22-02-2024 వ తేదీన ఉదయం 10-30లు లగాయతు శ్రీకోర్టు వారిచే వేలం జరుపబడును. కావలసినవారు వేలంలో పాల్గొని పాడుకొనవచ్చును. వేలం షరతులు కోర్టువారి నజారత్ యందు గాని, DHR తరుపు Advocate గారి ఆఫీసులో గాని తెలుసుకొనవచ్చును.
షెడ్యూలు
ప॥గో॥జిల్లా (ప్రస్తుతం తూ॥గో॥జిల్లా), నిడదవోలు సబ్‌రి॥లో చేరిన నిడదవోలు మున్సిపల్ Limits నిడదవోలు పట్టణంలో RS No. 828/3రు లో 120 చ॥గ॥ల స్థలం. అందలి Door No. 2-7/1-14A (Old Door No.2-7-35) రు గల RCC Building నకు హద్దులు : తూర్పు : 42-6 అ॥ యినపకుర్తి వెంకట్రావు గారి Compound Wall మరియు యిల్లు, దక్షిణం : 25 అ॥ మున్సిపల్ రోడ్, పడమర : 42.6 అ॥ భావన శీతారామయ్య గారి యిల్లు, ఉత్తరం : 26.0 అ॥ కాటం సత్యవతి వగైరాల స్థలం.
యీ హద్దుల మధ్య 120 చ॥గ॥లు స్థలంన్నూ, యిందలి D.No. 2-7/1-14A (Old D.No.2-7-35)రు గల RCC Building అందలి Electrical Service Connection మరియు Other Fittings సహా.
E.C. దాఖలా లావాదేవీలు ఏమీయూ లేవు.
DHR Value : రూ.1,80,000/-
Amin Value : రూ.2,00,000/-
యాగంటి చలపతి రావు, B.Com., B.L., కొవ్వూరు
DHR తరపు అడ్వకేట్. సెల్ : 94404 80154